విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

ప్రత్యర్థి పార్టీలపై ఫోకస్

- బూత్ కన్వీనర్లపై గురి
- ఓట్ల తీసివేత, చేర్పులపై పార్టీల పరుగులు

విశాలాంధ్ర బ్యూరో -ఏలూరు : జిల్లాలో కు 'యుక్తి 'రాజకీయాలు నడుస్తున్నాయి. వైసిపి, టిడిపి, జనసేన, పార్టీలు కుయుక్తి రాజకీయాలు చేయ డంలో దిట్టగా మారాయి. రాజకీయాలు వ్యాపార మయమైన నేపధ్యంలో డబ్బు విచ్చలవిడిగా చల్లేందుకు కూడా వెనుకాడటంలేదు. ప్రత్యర్థి బలం కంటే బలహీనతలను పరిగణనలోకి తీసుకొని వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారిన తరుణంలో ఏచిన్న అవకాశాన్ని వదులుకోకూడ దన్న నిర్ణయంలో ఉన్నారు. ముఖ్యంగా వైసిపి, టిడిపిలు ఈ పంధాను కొనసాగిస్తున్నాయి. ఇప్పటికే ప్రత్యర్థి పార్టీల కంచుకోటలపై కన్నేసిన నేతలు వారి ప్రయత్నాలలో బిజీగా ఉన్నారు. ఏ పార్టీ అయినా.. ఎంత కేడర్ ఉన్నా .. ఎన్నికల సమయంలో 'పోల్ మేనేజ్మెంట్ 'లేకపోతే ఓడిపోవడం తథ్యం. ఈనేపధ్యంలో ఎన్నికల సమయంలో పోల్ మేనేజ్ చేసే వారిపై కన్నేసిన పార్టీల నేతలు వారిని తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పాలక వైసిపి ఎన్నికలకు సంబంధించి అన్ని అంశాలను తమ చేతుల్లోకి తీసుకుని బలంగా కన్పిస్తోంది. కొందరిని ప్రలోభ పెట్టి పార్టీలోకి తీసుకురావడంలో వైసిపి వ్యూహాత్మక ఎత్తుగడలలో టిడిపి కంటే ముందుంది. వైసిపి బలహీనతలను తమకు అనుకూలంగా మలుచుకుంటూ ముందుకు సాగుతోన్న టిడిపికి కూడా అనేక అంశాలు కలిసి వస్తున్నట్లు తెలుస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో వైసిపిపై నెలకొన్న అసంతృప్తులను తమకు అనుకూలంగా మలుచుకుంటూ ముందుకు సాగు తున్నారు. పాలక పార్టీ లొసుగులను ఇంటిలిజెన్స్ ద్వారా తెప్పించుకుంటున్న టిడిపి వైసిపిని నైతికంగా దెబ్బకొట్టాలని ద్వితీయశ్రేణి కేడరును అనుకూలంగా మార్చుకుంటుంది.

ప్రత్యర్థి క్యాడర్‌పై గురి

రాజకీయ పార్టీలు తమ ప్రత్యర్థి క్యాడర్లో కొద్దిగా బలహీనతలు కనపడినా తమ పార్టీ వైపుకు తిప్పుకునే విధంగా ఎర చూపుతున్నారు. తాయిలాలు, పదవుల ఆశ కల్పించి తమ వైపుకు మార్చుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా బూత్ కమిటీలు, గ్రామాలు విడిచి వెళ్లిన వారి ఓట్లను పరిగణనలోకి తీసుకుంటూ తమకు ఓటు వేయని వారిని జాబితాలో తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఒక్కొక్క గ్రామానికి సంబంధించిన బూత్ కమిటీ కన్వీనర్లపై ప్రత్యర్థి పార్టీలు దృష్టి సారించి తమ వైపుకు మరల్చుకునే వ్యూహాత్మక ఎత్తుగడలు వేస్తున్నాయి.

మూడు నెలల ముందే మేల్కొన్న వైసీపీ

2024 ఎన్నికల ఎలక్షన్‌గా చేసుకున్న వైసిపి మూడు మాసాల ముందు నుంచే అనేక చర్యలు తీసుకుంది. వాలంటీర్ల వ్యవస్థను పటిష్టం చేసుకున్న వైసిపి తదనంతరం సచివాలయ కన్వీనర్లను కూడా ఏర్పాటు చేసిన విషయం విదితమే. 50 గృహాలకు సంబంధించిన అన్ని వివరాలను నమోదు చేసుకున్న పాలకపార్టీ సంక్షేమ పథకాలను దగ్గరుండి ఇప్పించే బాధ్యతలను వైసీపీ సచివాలయ కన్వీనర్లకు అప్పజెప్పిందంటే ఆయా ప్రాంతాలలో పూర్తిస్థాయి పట్టును సాధించినట్లే. తెలుగుదేశం విషయానికి వస్తే వీళ్ళు అదే పంథా అమలు పరచాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రతి ఇళ్లకు ఒక సాధికారక కమిటీని ఏర్పాటు చేసి అందుకు అనుగుణంగా ఆ కుటుంబాలకు ప్రభుత్వం పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని భావిస్తుంది.

మొదలైన ఓట్ల రాజకీయం

ఎన్నికలలో విజయం సాధించాలంటే ఓట్లు కీలకం కానున్నాయి. ఈ తరుణంలో పోల్ మేనేజ్మెంట్ నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఇటీవల దొంగ ఓట్లు అధికంగా ఉన్నాయని వాటిని తీసివేయాలని టిడిపి ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించింది. దీంతో ఎన్నికల కమిషన్ చర్యలకు దిగింది. ఇటీవల జిల్లా కలెక్టర్లతో సమావేశమైన ఎన్నికల కమిషన్ ఎన్నికల జాబితా నిష్పక్షపాతంగా ఉండాలని సూచించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్నారు. అన్ని పార్టీలతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. తుది జాబితా ప్రకటించిన తర్వాత పార్టీలు ఎన్నికల ఎత్తుగడలు వేయడంలో మునిగి తేలుతాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

దేశభక్తి, జాతీయతకు దర్పణం పట్టేలా గణతంత్ర వేడుకలు

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సన్నాహక సమావేశం

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లాలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు అవ సరమైన అన్ని ఏర్పాట్లు చేయ డంతోపాటు సంబంధిత శాఖలు మరింత సమన్వయం చేసుకోవా లని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మంది రంలో బుధవారం సంబంధిత అధికారులతో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సన్నాహక సమావేశం నిర్వహించారు. వేడుకల నిర్వహణపై సంబంధిత అధికారులకు దిశా, నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఈనెల 26వ తేది ఉదయం 9.00 గంటల నుంచి నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏలోటు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు ఏలూరు ఆర్డీవో కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారన్నారు. జిల్లాకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. ఆయా శాఖల్లో ఉత్తమ పనితీరు కనబరిచే వారికి ప్రశంసా పత్రాలు బహూకరించే క్రమంలో జిల్లా అధికారులు ఈనెల 23వ తేదీలోగా ఆయా సిబ్బంది పేర్లను సిఫార్సు చేయాలన్నారు. ఇందుకోసం డిఆర్ఓ ఆధ్వర్యంలో కమిటీ ఆపేర్లను పరిశీలించి ఈనెల 24వ తేదీ ఉదయం కల్లా తమకు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏలూరు డిఎస్పీ ఈ శ్రీనివాసులు, ఏలూరు ఆర్డిఓ ఎన్ఎస్ కె. ఖాజావలి, జెడ్పి సిఇఓ కె.ఎస్.ఎస్. సుబ్బారావు, డిఆర్డిఏ పిడి డా. ఆర్. విజయరాజు, హౌసింగ్ పిడి కె. రవికుమార్, ఇరిగేషన్ ఎస్ఇ శ్రీనివాసరావు తదితర వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఇండోర్ స్టేడియం నుంచి బైక్ ర్యాలీ

- ఎఎస్ఆర్ స్టేడియంలో మానవహారం

విశాలాంధ్ర-ఏలూరు: సామాజిక సమతా సంకల్ప మహోత్సవాల్లో భాగంగా గురువారం బైక్ ర్యాలీ, మానహారం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో బుధవారం సంబంధిత అధికారులతో బైక్ ర్యాలీ, మానవహారం కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించారు. ఈనెల 19వ తేదీన విజయవాడలో భారతరత్న డా.బి.ఆర్. అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు ముందస్తుగా సామాజిక సంకల్పం పేరుతో చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా ఈ బైక్ ర్యాలీ ఏలూరు ఇండోర్ స్టేడియం నుంచి బుధవారం ఉదయం గం.9లకు మొదలై ఫైర్ స్టేషన్ సెంటర్, పాత బస్టాండ్ మీదుగా అల్లూరి సీతారామరాజు స్టేడియం వరకు కొనసాగుతుందన్నారు. అనం తరం మానవహారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏలూరు డిఎస్పీ ఈ శ్రీనివాసులు, ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్ కె. ఖాజావలి, జెడ్పి సిఇఓ కె.ఎస్.ఎస్. సుబ్బారావు, డిఆర్డిఏ పిడి డాక్టర్ ఆర్. విజయరాజు, హౌసింగ్ పిడి కె. రవికుమార్, మున్సిపల్ కమిషనరు ఎస్. వెంకటకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

22న ఓటరు తుది జాబితా విడుదల

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో ప్రతి విషయాన్ని ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల ప్రతినిధుల దృష్టికి తీసుకు వస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో కలెక్టర్ ఛాంబర్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతి నిధులతో సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 16,24,413 మంది ఓటర్లుగా నమోదైవున్నా రన్నారు. ముసాయిదా ఓటరు జాబితాపై జనవరి 16వ తేదీ వరకు వచ్చిన క్లైయిమ్ లు, అభ్యంతరాలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 3,16,259 దరఖాస్తులు స్వీకరించగా 2,96,833 ధరఖాస్తులు పరిష్కరించా మన్నారు. ఇంకా ఫారం-6 కింద 910, ఫారం-7 కింద 1303, ఫారం-8 కింద 1912 మొత్తం కలిసి 4,125 ధరఖాస్తులు పరిష్కరించవలసి వుందన్నారు. ఓటరు తుది జాబితాను ఈనెల 22వ తేదీన ప్రకటించడం జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో సిర్రా భరత్(బిఎస్పీ), నెరుసు నెలరాజు(బిజేపి), పి. ఆదిశేషు (సిపిఎం), ఆర్. రామ్మోహన్ రావు(కాంగ్రెస్), పాలి ప్రసాద్(టిడిపి), కలవకొల్లు సాంబ(వైఎస్ఆర్ సిపి), కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల ఏర్పాట్లు పూర్తి చేయాలి



విశాలాంధ్ర-భీమవరం : జిల్లాలో భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చెయ్యాలని జిల్లా అధికారులను జిల్లా రెవిన్యూ అధికారి బి. శివన్నారాయణ రెడ్డి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేటు స్పందన సమావేశ మందిరంలో జనవరి 26 భారత గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల జిల్లా అధికారులతో సన్నాహక సమావేశాన్ని జిల్లా రెవిన్యూ అధికారి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లాలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గత అనుభవాలు దృష్టిలో పెట్టుకుని, గతంలో చిన్న చిన్న లోటుపాట్లు ఉంటే అవి సరి చేసుకుని వేడుకలు విజయవంతం అయ్యేలా ఏర్పాట్లు మొదలు పెట్టాలన్నారు. గత ఏడాది మాదిరిగా స్థానిక జిల్లా కలెక్టరేటు ఆనుకుని ఉన్న పోలీసు పెరేడు గ్రౌండులో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. త్రాగునీటి ఏర్పాట్లను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వివిధ ప్రభుత్వ పథకాల సమాచారాన్ని క్రోడీకరిస్తూ సందేశాత్మకంగా, వినూత్నంగా 10 శకటాలను రూపొందించాలన్నారు. జిల్లా అధికారులు అందరు సమిష్టిగా పనిచేసి గణతంత్ర దినోత్సవ వేడుకలు విజయ వంతానికి తమ వంతు కృషి చెయ్యాలని జిల్లా రెవిన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో భీమవరం ఆర్డీవో కె శ్రీనివాసులు రాజు, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్, జిల్లా కలెక్టరు కార్యాలయం పరిపాలన అధికారి వైకెపి అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నాయకుడు కన్నుమూత

విశాలాంధ్ర-పెనుగొండ: కొఠాలపర్రు గ్రామ నివాసి,సీనియర్ నాయకులు మాజీ వాటర్ డిస్ట్రిబ్యూటీ చైర్మన్, తెదేపా రైతు అధికార ప్రతినిధి గంధం వెంకట్ రాజు బుధవారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య కుమార్తె కుమారుడు ఉన్నారు. భార్య కొఠాలపర్రు సర్పంచ్ గా కొనసాగుతున్నారు. మాజీ మంత్రి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణకు అత్యంత సన్నిహితులుగా మెలిగారు. వెంకట్ రాజు మరణం టిడిపి, జనసేన పార్టీకి తీరని లోటు అని పితాని సత్యనారాయణ అన్నారు.

నూజివీడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బీసీలకు కేటాయించాలి

విశాలాంధ్ర - ఆగిరిపల్లి : నూజివీడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బీసీలకు కేటాయించాలని ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం మాజీ జడ్పీటీసీ సభ్యులు కాజ రాంబాబు అన్నారు. బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నూజివీడు అసెంబ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సామాజిక న్యాయంలో భాగంగా బీసీ సామాజిక వర్గానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ఇరవై సంవత్స రాలుగా కాంగ్రెస్,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు ఒకే సామాజిక వర్గానికి కేటాయిస్తుందని దీని వల్ల నియోజక వర్గంలో అధికంగా ఉన్నటువంటి బీసీలకు, ఎస్సీలకు అన్యాయం జరుగుతుందని అన్నారు.ఇరవై ఏళ్లుగా టిక్కెట్టు పొందుతున్న ఆ వర్గం వారు నియంతలుగా వ్యవహరిస్తూ యితర కులాల ఓటుబ్యాంక్గా చేస్తున్నారు తప్ప వారి అభివృద్ధికి ఎటువంటి కృషి చేస్తున్న దాఖలాలు లేవు అన్నారు. సామాజిక సాధికారిత యాత్రలు నిర్వహిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్పార్టీ నూజివీడు నియోజకవర్గతో అత్యధిక జనాభాగా ఉన్న బీసీలకు కేటాయించి నియోజకవర్గంతో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నారని తెలిపారు.

ముదిరాజ్ హక్కులసాధనకై పోరాడతాం

విశాలాంధ్ర - ఆగిరిపల్లి : ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి ముదిరాజ్ కుల పెద్దల సమక్షంలో ముదిరాజ్ సంఘం రాష్ట్రకమిటీ రూపొందించిన కాలెండర్ను సంఘం రాష్ట్ర అధ్యక్షులు చప్పిడి. కృష్ణమోహన్ ముదిరాజ్ ఆవిష్కరించారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ రానున్న కాలంలో ముదిరాజ్ కులస్తుల హక్కుల సాధనకై యువతకు శిక్షణా తరగతులు నిర్వహించి పోరాటకార్యక్రమం రూపొందించనున్నట్లు తెలిపారు.ఏడున్నర దశాబ్దాల స్వాతంత్ర్యా నంతరం కుడా ముదిరాజ్ కులస్తులు ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధికి దూరంగా వెనుక్కుబడి ఉండడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. బిసి (డి) గ్రూప్లో ముదిరాజ్ కులస్తులను చేర్చడంతో తీరని నష్టం జరిగిందన్నారు. ముదిరాజ్ కులస్తుల హక్కుల సాధనకై రాజకీయాలకు అతీతంగా పోరాడుతామని కృష్ణమోహన్ ముదిరాజ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కుల సంఘం నాయకులు గునిశెట్టి. సత్యనారాయణ, దుప్పల సీతయ్య, బోనం శ్రీనివాస్, జి.వెంకటేశ్వరరావు, బోట్ల. విష్ణు, బోనం దుర్గరావు, ఎస్.నాగరాజు, జనార్దన్, మహిళా సంఘం నాయకురాలు వేమారెడ్డి నిర్మల, ప్రసాద్, ముదిరాజ్ సంఘం టెక్నికల్ ఇన్‌చార్జి చొప్పర నాగేంద్రరావు, బి.హరీష్, జి.శోభనాచలం, ఎస్.రామయ్య, జి.అశోక్ పాల్గొన్నారు.

పేద మహిళలకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - గణపవరం: గ్రామంలో పేద మహిళలకు, వృద్ధులకు ఏదో చేయాలన్న తపనతో సంక్రాంతి పండుగ పురస్కరిం చుకుని గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన కొలనువాడ సుబ్బరాజు, ఆయన సతీమణి లక్ష్మీ కుమారి దంపతులచే ఈ ఏడాది 250 మంది పేద మహిళలకు నగదు రూపంలో వారికి అందజేశారు. పార్టీలకు, రాజకీయాలకు కుల మతాలకు అతీతంగా గ్రామంలో అందరివాడుగా పిలవబడుతున్న ఆయన గ్రామంలో శివాలయం వద్ద ముగ్గులు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సుబ్బరాజును పలువురు గ్రామస్తులు అభినందించారు.

నర్సాపురం ఎంపిని సత్కరించిన టిడిపి బిసి సెల్ నాయకులు

విశాలాంధ్ర -భీమవరం: నరసాపురం ఎంపి కనుమూరి రఘురామకృష్ణంరాజును టిడిపి బిసి సాధికారత కమిటీ డైరెక్టర్ గంటా త్రిమూర్తులు, నాగలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో టిడిపి బిసి సెల్ నాయకులు గజమా లతో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ జగన్ ప్రజా వ్యతిరేక పాలనపై నిరంతరం పోరాటం చేస్తున్న ఎంపి కృష్ణంరాజునేనని, జగన్ అవితిని వ్యతిరేక పాలనపై ఎదురొడ్డి పోరాటం చేస్తున్నారని, రానున్నది మిత్ర పక్షమైన టిడిపి, జనసేన పార్టీ లేనని గంటా నాగలక్ష్మి, త్రిమూర్తులు అన్నారు. కార్యక్రమంలో గంటా వెంకట వినిత, బొమ్మిడి వెంకటేశ్వరరావు, బొమ్మిడి ప్రసాద్, మైలబత్తుల ఐజాక్ బాబు, యలమంచిలి శ్రీను, వినాయక్, రమణ, మణి దుర్గ, యలమంచిలి వాసు, యలమంచిలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మాచారి మృతి బుర్ర కథ కళారంగానికి తీరని లోటు

విశాలాంధ్ర-టి నరసాపురం: తిప్పర్తి వీర బ్రహ్మాచారి మృతి బుర్ర కథ కళారంగానికి తీరని లోటు అని ప్రజా నాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్ అన్నారు. బొర్రంపాలెం గ్రామంలో బ్రహ్మాచారి సంస్కరణ సభ సహాయ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమళ్ళ మధు అధ్యక్షతన బుధవారం నిర్వహించ బడింది. ముందుగా పలువురు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పిం చారు. ఈ సందర్భంగా టివిఎస్ రాజు మాట్లాడుతూ మంచి బుర్ర కథ కళాకారు డిని కోల్పోయాము అన్నారు. బ్రహ్మాచారితో తనకున్న అనుబంధం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్య నారాయణ, ప్రముఖ కవి తెప్ప పల్ల రామకృష్ణ,అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని నాగార్జునసాగర్,సీనియర్ జానపద కళాకారులు చిలుకూరి సుబ్బయ్య చారి, పౌరాణిక కళాకారులు తోట సత్యనారాయణ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెంట్లమ్మ తల్లి ఉత్సవం

విశాలాంధ్ర - పెంటపాడు: ఉమామహేశ్వరం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా గ్రామ దేవత పెంట్లమ్మ తల్లి సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని గుడిలో నుంచి, పూరి గుడిసె వద్దకు తీసుకువచ్చారు. అనంతరం గరగలతో,డప్పులతో పూరి గుడిసె వద్ద నుంచి పుట్టింటికి తీసుకుని వెళ్లారు. మద్దుకూరి రామకృష్ణ దంపతులు వారి ఇంటి వద్ద పానుపు వేశారు. అత్తవారింటికి తీసుకుని వెళ్లారు. పసుమర్తి శ్రీరాములు దంపతులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగినది. గ్రామోత్సవం జరిగిన అనంతరం సాయంత్రం అమ్మవారిని గుడి వద్ద ఉంచారు. బుధవారం ఉదయం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.ప్రతి సంక్రాంతికి, రాయుడు సాంబయ్య కుమారుడు రాయుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం మహిళలకు ముగ్గులు పోటీలు,పిల్లలకు ఆట పోటీలు, మ్యూజికల్ చైర్స్, ఫాన్సీ డ్రెస్, హౌసీ నిర్వహించారు.అనంతరం తాడేపల్లిగూడెం రూరల్ సి.ఐ. రమేష్, పెంటపాడు ఎస్.ఐ. డి. హరికృష్ణ బహుమతులు అందజేశారు. ప్రతి సంవత్సరం రాయుడు శ్రీనివాస్ వారి కుటుంబ సంప్రదాయం ప్రకారం సంక్రాతి సందర్భంగా ఇరిగేషన్, రెవెన్యూ,పోలీస్ డిపార్ట్మెంట్ లు విలేకరులకు సంప్రదాయంగా వస్త్రాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో రాయుడు లక్ష్మీదినేష్, కోడూరి మంగరాజు, కొండ్రెడ్డి హైమావతి, నల్లమాటి కృష్ణమూర్తి, మద్దుకూరి వెంకట సుబ్బారావు, ప్రతివాది భయంకర రాఘవాచార్యులు, వెలగలేటి వెంకటేశులు, పెంటపాడు రత్తయ్య, తాడేపల్లి కాత్రాజు, కొంచాడ రాఘవులు, అంజూరి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఒక్కడు

విశాలాంధ్ర - చాట్రాయి : ఒకే ఒక్కడుగా నూజివీడు నియోజకవర్గంలో వ్యూహాత్మకంగా పావులు కదుపుతూ సంచలన రాజకీయాలను సృష్టిస్తున్నారు. 87 రోజుల క్రితం స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని ప్రకటించి గ్రామాలలో 67 గ్రామాలలో క్షేత్రస్థాయిలో తన అభిమానులు, సానుభూతిపరులతో మాజీ శాసన సభ్యులు చిన్నం రామకోటయ్య చాప కింద నీరులా విస్తరించారని పలువురు అంటున్నారు.2009లో ప్రజారాజ్యం ఆవిర్భావంతో రాజకీయ రంగ ప్రవేశం చేసిన చిన్నం రామకోటయ్య ఉద్యమ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజారాజ్యంలో సీటు దక్కకపోయినా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు దృష్టిని ఆకర్షించి తెలుగు దేశం అభ్యర్థిగా నూజివీడు నియోజకవర్గం లో స్థానిక శాసనసభ్యుడు ప్రతాప్ అప్పారావును ఓడించారు. రాజకీయ సంచలనాన్ని సృష్టించారు. ప్రస్తుతం 87ఏడు రోజుల క్రితం రాజకీయం ప్రారంభించినప్పటికీ నియోజకవర్గం ఉన్న ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. చాట్రాయిలో పుట్టి పెరిగిన రామకోటయ్య వైసిపి కి కంచుకోట అయిన చాట్రాయి మండలంపైనే ప్రత్యేక దృష్టి సారించారు. వైసీపీ అసంతృప్తి వాదులకు గాలం వేశారు తన సొంతం చేసుకున్నారు. నియోజకవర్గంలో జగన్ మోహన్ రెడ్డి వచ్చిన సందర్భంలో చింతలపూడి ఎత్తిపోతల పథకంపై ప్రత్యేకంగా మాట్లాడి నెల రోజులు పూర్తయిన సందర్భంగా "జగనన్నకు గుర్తు చేద్దా"మంటూ నియోజకవర్గం లో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే అసంపూర్తిగా ఉన్న చింతలపూడి ఎత్తిపోతల పథకం పై కాలవపై ప్రత్యేకమైన మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. బూరుగుగూడెం గ్రామంలో ప్రభుత్వ పథకాలు జరిగిన తీరును తెలియజేయాలంటూ సమాచార హక్కు చట్టంలో లిఖిత పూర్వకంగా కోరారు. బూరుగుగూడెం గ్రామం వైసిపి రాష్ట్ర నాయకుడు ప్రాతినిధ్యం వహిస్తున్న ఊరు కావడం గమనార్హం. ఎక్కడైతే బలంగా ఉందని వైసిపి నాయకులు బాహాటంగా చెప్పుకుంటున్నారో పెద్ద ఎత్తున మెజారిటీ ఉందంటున్నారు. అక్కడే వారి బలహీనతలను ఎండగట్టి రామకోటయ్య ప్రజల దృష్టిని ఆకర్షించారని పలువురు అంటున్నారు. ఈనేపథ్యంలో ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ వచ్చే శాసనసభ ఎన్నికల్లో నూజివీడు శాసనసభ్యులుగా ఉన్న ప్రతాప్ అప్పారావుకి తనకే ప్రధానమైన పోటీ జరుగుతుందని నియోజకవర్గంలోని 87 గ్రామాలు నూజివీడు పట్టణంలో తనకు పెద్ద ఎత్తున మద్దతు లభిస్తుందని తాను కచ్చితంగా గెలిచి తీరుతానని విశ్వాసం వ్యక్తం చేశారు.

చలో కడప విజయవంతం చేయండి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఎస్సీలను ఏబిసిడి లుగా వర్గీకరించి తమ సమస్యను పరిష్కరించాలని ఎంఆర్పిఎస్ రాష్ట్ర కార్యదర్శి లాగు ప్రకాష్, ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు గొల్లమందల శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. జనవరి 20వ తేదీన కడపలో నిర్వహించబోతున్న మాదిగల రాజకీయ సమన్వయ మహాసభకు చెందిన కరపత్రాలను స్థానిక అంబికా రెస్టారెంట్ వద్ద లయన్స్ క్లబ్ సభ్యుడు ఉక్కుర్తి సీతారాం విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు ప్రకాష్,శ్రీనివాస రావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల పాటు ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని అన్నారు. ఈ మహా సభకు జిల్లా మాదిగ, మాదిగ ఉప కులాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ఉద్యోగులు మహిళలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి కడిమి రాజేష్ కుమార్,ఎం.ఆర్.పి.ఎస్. పట్టణ అధ్యక్షుడు మద్దిపాటి ఇస్సాకు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి రాజకీయాలు ఎలా మారుతాయో !

విశాలాంధ్ర - లింగపాలెం : చింతలపూడి నియోజకవర్గ రాజకీయాలు ఎలా మలుపు తిరగబోతున్నాయనేది ఆసక్తికర చర్చ కొనసాగుతుంది. రాష్ట్ర రాజకీయాలలో చింతలపూడి నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు ఎటువైపు ఉండబోతున్నారనేది రాజకీయ నాయకులలో ఉత్కంఠను కలిగిస్తుంది. రాజకీయాలలో నియోజకవర్గం వ్యూహాలకు, ప్రతి వ్యూహాలకు పెట్టింది పేరు. అధికార వైసీపీలో ఈ పార్టీ ఎమ్మెల్యేని కాదని విజయరాజును ఇన్‌చార్జిగా అధిష్టానం నియమించింది. ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న ఈయన బలోపేతం కావటానికి వేగంగా అడుగులు వేస్తున్నారు. ఇక ఎమ్మెల్యే ఎలీజా రాజకీయపయనం ఎటువైపు అనేదానిపై సందిగ్ధత నెలకొంది. ఇప్పటికే ఈయన తనను పార్టీ ధిక్కారం చేసిందని ఆరోపిస్తున్నారు. ఇక ఇదిలా ఉంటే ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఉన్న తెలుగుదేశం అభ్యర్థి ప్రకటన జాప్యమవుతుండటంతో పార్టీ కేడర్ నుంచి అసంతృప్తులు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే ఉన్న అధికార పార్టీలో మరొకరిని ఇన్‌చార్జిగా నియమించిందని, అధికారంలో లేని పార్టీకి ఇన్‌చార్జిని నియామకాన్ని ఎందుకు జాప్యం చేస్తున్నారని దిగువస్థాయి నాయకులు అగ్రనాయకులను ప్రశ్నిస్తున్నారు. పెద్ద నాయకులు సైతం వీరి ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోతున్నారు. నియోజకవర్గంలో టీడీపీ బలంగా ఉందని తామంతా ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టినా గెలుపుకోసం తీవ్రంగా కృషి చేస్తామని అంటున్నారు. కుల సమీకరణలు, పొత్తులతో కాలయాపన చేయటం వల్ల నిరుత్సాహం నెలకొందని దిగువస్థాయి కేడర్ అంతా అంటున్నారని నియోజకవర్గ స్థాయిలోని పలువురు పెద్ద నాయ కులే అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికార వైసీపీలో వర్గ భేదాలను అనుకూలంగా మలుచుకోవాలనే తమ వ్యూహాలు అభ్యర్థి ఎంపిక జాప్యంతో దూరం అవుతున్నాయని పలువురు టీడీపీ నాయకులు అంటు న్నారు.

టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర -భీమవరం: సంక్రాంతి పండుగ సందర్భంగా రాయలం గ్రామంలో కోళ్ళ సోదరుల ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ కోళ్ళ అబ్బులు అతిథి గృహం వద్ద బుధవారం జరిగిన భీమవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ అభిమానుల అల్పాహార ఆత్మీయ సమావేశంలో నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు పాల్గొని కేక్ కట్ చేశారు. ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, భీమవరం, ఉండి మాజీ ఎమ్మెల్యేలు పులపర్తి అంజిబాబు, కలవపూడి శివరామరాజు, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు మెంటే పార్థసారథి, కోళ్ళ నాగేశ్వరరావు, వీరవాసరం ఎంపిపి వీరవల్లి దుర్గా భవానీ, జడ్పీటిసి గుండా జయప్రకాష్ నాయుడు, బర్రె నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీలు

విశాలాంధ్ర - కలిదిండి: యువతీ యువకులకు సాంప్రదాయ క్రీడల పట్ల అవగాహన కల్పించేందుకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా గ్రామాలలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు అన్నారు. బుధవారం మండలంలోని మూలలంక, భాస్కరరావుపేట గ్రామాలలో బాల బాలికలకు, మహిళలకు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళలకు ముగ్గుల పోటీలు, యువకులకు రన్నింగ్, స్లో సైక్లింగ్, పోటీలు, బాల బాలికలకు మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్, రన్నింగ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. మహిళలు, బాల బాలికలు, యువకులు ఉత్సాహంగా పాటల పోటీలలో పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వి. భాస్కరరావు, కే. శ్రీనివాసరావు, కెవిపిఎస్ నాయకులు ముంగం. సురేష్, మహిళా సంఘం నాయకులు ఎస్. మహాలక్ష్మి, వి. వరలక్ష్మి, ఎం. రుక్మిణి, డివైఎఫ్ఐ నాయకులు గద్దె. అనిల్ కుమార్, పి. వెంకట రామకృష్ణ, జక్కంశెట్టి. పెద్దిరాజు, కే. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర - కలిదిండి: ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిసాము చదువులమ్మ చెట్టు నీడలో అంటూ పూర్వపు విద్యార్థులు ఆత్మీయ కలయికతో సందడి వాతావరణం ఏర్పడింది. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 1996 - 97 లో చదువుకున్న పూర్వపు విద్యార్థులు గెట్ టు గెదర్ కార్యక్రమం ఏర్పాటు చేయగా 27 ఏళ్ళ క్రితం చదువుకున్న విద్యార్థులు కలుసుకోవడంతో ఆహ్లాదకర వాతావర ణం ఏర్పడింది. ఆనాటి తీపి గుర్తులను నెమరు వేసుకుని పూర్వపు విద్యార్థులు ఒకరినొకరు అలిగినం చేసుకుంటూ ఆనందంతో ఉత్సా హంగా ఉల్లాసంగా గడిపారు. ఆనాడు చదువు చెప్పిన గురువులైన శ్రీహరి, పూర్ణచంద్రరావు, కోట. శర్మ, పెండ్యాల. వెంకటేశ్వరరావు, రవిశంకర్, మురళీకృష్ణ లకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి పాదాభివందనం చేశారు. విద్యార్థుల సమాచారం సేకరించి ఈ కార్యక్రమాన్ని ముందుకు నడిపిన వారికి గురువులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, ఈశ్వర్, శివకోటి, వెంకన్న బాబు, సోమరాజు, సతీష్, గొల్లయ్య, లక్ష్మీనారాయణ, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, రాంబాబు, పెద్దిరాజు, రామకృష్ణ, తులసి, వెంకటలక్ష్మి, తార, సుజాత, బాంధవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన కూటమి విజయం తథ్యం

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం : రానున్న అసెంబ్లీ ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఘన విజయం సాధించడం తథ్యమని నరసాపురం పార్లమెంట్ సభ్యులు కనుమూరి రఘురామకృష్ణంరాజు చెప్పారు. బుధవారం తాడేపల్లిగూడెం నియోజకవర్గ తెదేపా ఇన్‌చార్జి వలవల మల్లికార్జున రావు గూడెంలో ఆయనకు స్వాగతం పలికారు. భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా ప్రాబల్యం నానాటికి తగ్గుతుందన్నారు. రాబోయే ఎన్నికలలో నరసాపురం పార్లమెంటు నుండి ఎంపీగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి జనసేన లో విజయం తథ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల మల్లికార్జునరావు, డిసిసిబి మాజీ సభ్యులు దాసరి అప్పన్న, పెంటపాడు మండల పార్టీ అధ్యక్షులు కిలపర్తి వెంకట్రావు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు గంధం సతీష్, రూరల్ మండల అధ్యక్షులు పరిమి రవికుమార్ తదితరులు ఉన్నారు.